ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	:9985445760
ధర్మవరం, పుట్టపర్తి	: 9963160529
కదిరి	:9052518170

ఏసీఎం: 9985411154

పద్మభూషణుడికి పౌరసన్మానం



- నేడు ఎంజీఎం క్రీడామైదానంలో కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి
- విద్యుద్దీపాల వెలుగులో పురం
- నేడు ఎమ్మెల్యే బాలకృష్ణ రాక
- హాజరుకానున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు
- పురంలో ట్రాఫిక్ మళ్లింపు

హిందూపురం, మే3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డు అందుకోవడంతో ఆయనకు పట్టణంలో పౌరసన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి ఎంజీఎం క్రీడామైదానం సిద్ధమైంది. శనివారం సాయంత్రానికే 10వేల మంది కూర్చునేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కుర్చీలు కూడా సిద్ధం చేశారు. ఇందులో ఎంఐపీ, వీవీఐపీ, వీఐపీ, సాధారణ ప్రజలు కూర్చునేలా గ్యాలరీలు సిద్ధం చేశారు. మైదానంలో పలుచోట్ల వాటర్‌బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్ల కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎంజీఎం క్రీడామైదానం చుట్టూ ఎల్‌ఈడీ బల్బులు వేశారు. హిందూపురంలోని ప్రధాన రహదారులన్నీ బెంగళూరు నుంచి తెప్పించిన ఎల్‌ఈడీ బల్బులు వేయించారు. రోడ్డుకిరువైపులా రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. తెలుగుదేశం నాయకులు, బాలకృష్ణ అభిమానులు పెద్దఎత్తున ఫ్లెక్సీలు కట్టారు.

నేడు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల రాక

ఎమ్మెల్యే బాలకృష్ణకు పౌరసన్మానసభ నిర్వహించనున్న నేపథ్యంలో హిందూపురానికి ఆదివారం మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. వీరితోపాటు పలువురు ప్రముఖులు వస్తున్నారు. కార్యక్రమానికి పలువురు గాయకులు విచ్చేస్తున్నారు.

నేడు పురానికి బాలకృష్ణ

ఆదివారం హిందూపురానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రానున్నారు. సాయంత్రం 6.30 గంటలకు రహమత్‌పురంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభిస్తారు. 7 గంటలకు ఎంజీఎం క్రీడామైదానంలో జరిగే పౌరసన్మాన సభకు హాజరవుతారు. సోమవారం ఉదయం వాసవీ దేవాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 9 గంటలకు టేకులోడు గురుకుల పాఠశాలలో భవన నిర్మాణానికి భూమిపూజ, 10 గంటలకు హిందూపురం పట్టణ పరిధి ఇందిరమ్మ కాలనీలో 250మందికి పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నారు.

భారీ బందోబస్తు

బాలకృష్ణ సన్మాన సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీతోపాటు ముగ్గురు ఏఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 60 మంది ఎస్‌ఐలు, బాడీ కెమెరా బృందాలు, ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది మొత్తం 600 మంది బందోబస్తులో పాల్గొననున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పట్టణంలో ట్రాఫిక్ మళ్లించారు. చిలమత్తూరు వైపు నుంచి సభకు వచ్చేవారు రహమత్‌పురంలో వాహనాలు దిగి ఎంజీఎంకి నడుచుకుంటూ వెళ్లాలి. వాహనాలు టూటౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా నిలుపుకోవాలి. గోరంట్ల, పెనుకొండ వైపు నుంచి వచ్చే వాహనాలు రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆపేశారు. మడకశిర వైపు నుంచి వచ్చే వాహనాలు వీరేశ్ పెట్రోల్ బంకు వద్ద ఆపేసుకోవాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11 వరకు బైపాస్ రోడ్డు మీద రిలయన్స్ పెట్రోల్ బంకు నుంచి రహమత్‌పుర సర్కిల్ వరకు వాహనాలకు అనుమతి లేదని డీఎస్పీ మహేష్ తెలిపారు.



సిద్ధమవుతున్న సభావేదిక

మారని దారులు

అధ్వానంగా గ్రామీణ రహదారులు

గుంతలుపడి, కంకర తేలిన రోడ్లు

ప్రమాదాలబారిన పడుతున్న ప్రజలు

ప్రయాణం చేయాలంటే గ్రామస్థుల హడల్



అధ్వానంగా ఉన్న రాంపురం నుంచి ధర్మవరం వెళ్లే రహదారి



గుంతలమయమైన మల్లేనిపల్లి, తుమ్మలకు వెళ్లే రహదారి



కంకరతేలిన ధర్మవరం నుంచి వెంకటతిమ్మాపురం వెళ్లే రహదారి



గొట్లూరు నుంచి మల్కాపురం వెళ్లే రహదారి దుస్థితి

ధర్మవరంరూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. గత వైసీపీ పాలనలో పల్లె రోడ్లను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. గుంతలు ఏర్పడి, కంకరతేలడంతో ఆ రోడ్లపై ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లాలంటే ఆయా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఆయా గ్రామాల ప్రజలు ఈ రోడ్లపై వెళ్తూ ప్రమాదాలబారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా రోడ్లను బాగు చేసి తమ ప్రయాణం సాఫీగా సాగేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- మండలంలోని మల్లేనిపల్లి, తుమ్మల, తిప్పేపల్లి, సుబ్బరావుపేట గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది రోడ్డంతా గుంతలమయం కావడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు.
- రాంపురం నుంచి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి కంకర తేలి గుంతలు ఏర్పడి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఈ గ్రామం నుంచి ధర్మవరం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్లుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు వారు పేర్కొన్నారు.
- కామిరెడ్డిపల్లి క్రాస్ నుంచి ముచ్చురామి గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది.
- రావులచెరువు నుంచి వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి కంకర తేలింది. సుమారు 6 కిలోమీటర్ల మేర రోడ్డంతా కంకరతేలి గుంతలమయం కావడంతో ఆ గ్రామస్థులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గొట్లూరు నుంచి మల్కాపురం వెళ్లే రోడ్డు కిలోమీటరుపైగా కంకర తేలి అధ్వానంగా ఉంది. దీంతో మల్కాపురం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

బండెక్కాలంటే భయం



మా గ్రామం నుంచి ధర్మవరం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో బండెక్కాలంటే భయపడే పరిస్థితి ఉంది. గతంలో చాలామంది బైకులు అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం సరిగా లేకపోతే వాహనంలో పట్టణానికి తీసుకెళ్లాలన్నా ఇబ్బందిగానే ఉది. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయించాలి.

- రామ్మోహన్, మల్లేనిపల్లి

నివేదికలు పంపాం



మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లను మరమ్మతులు చేసేందుకు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. రోడ్ల దుస్థితి గురించి మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే మరమ్మతులు చేపడుతాం. గ్రామస్థులకు ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈ, ధర్మవరం

తొలిరోజు ప్రశాంతం

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

205 మంది గైర్హాజరు

6

పంటలు నేలపాలు

- మళ్లీ దెబ్బకొట్టిన గాలివాన
- వరి, అరటి, మామిడి రైతులకు భారీ నష్టం



తలమర్లలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వీహెచ్‌ఏ

కొత్తచెరువు /నెట్‌వర్క్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి గాలివానకు అరటి, మామిడి, వరి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లాలో 132.61 హెక్టార్లల్లో రూ.2.01 కోట్ల విలువైన పంట నష్టం జరిగింది. వివిధ మండలాల్లో 102 మంది రైతులకు సంబంధించి 88.61 హెక్టార్లల్లో రూ.1.63 కోట్లు విలువైన అరటి, మామిడి, బొప్పాయి, మునగ పంటలు దెబ్బతిన్నాయి. శింగనమల మండలంలో 77 మంది రైతులకు సంబంధించి 44 హెక్టార్లల్లో రూ.38 లక్షల విలువైన మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ, కొత్తచెరువు, కదిరి మండలాల్లో 19 మంది రైతులకు చెందిన 20 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతింది. రూ.3 లక్షల దాకా నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. కొత్తచెరువు మండలం తలమర్లలో రైతు వెంకటరెడ్డి రెండు ఎకరాలలో, కేశాపురంలో ఓబులమ్మ ఒకటిన్నర ఎకరంలో సాగు చేసిన మొక్కజొన్న దెబ్బతింది. మామిడి తోటలు సుమారు 400 ఎకరాలలో దెబ్బతిన్నాయి. రూ.20లక్షల దాకా నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుక్కపట్నం మండలం సిద్దరాంపురంలో ఇద్దరు రైతులకు చెందిన ఐదు ఎకరాలలో అరటిపంట దెబ్బతిని రూ.2.50 లక్ష వరకు నష్టం జరిగిందని తెలిపారు. బుక్కపట్నం మండలంలో మామిడి పంట ఎక్కువగా దెబ్బతిందని, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

23 మండలాల్లో వర్షం

అనంతపురం జిల్లాలోని 23 మండలాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమల మండలంలో 42.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరులో 24.2, వజ్రకరూరు 17.2, రాప్తాడు 16.2, బుక్కరాయసముద్రం 14.2, బొమ్మనహాళ్ 13.2, డి.హీరేహాళ్, కణేకల్లు, ఉరవకొండ మండలాల్లో 10, పెద్దపప్పూరు 9.8, గుమ్మఘట్ట 8.2, నార్పల 5.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న అరటి

- అనంతపురం రూరల్ మండలం చియ్యేడు, పూలకుంటలో రెండు అరటి తోటలు దెబ్బతిన్నాయి. ఉప్పరపల్లిలో రెండు ఎకరాలు, మన్నీలలో ఇద్దరు రైతులకు సంబంధించి 4.5 ఎకరాల్లో అరటి పంట దెబ్బతినింది. నష్టాన్ని అంచనా వేసి జిల్లా

(మిగతా 6వ పేజీలో..)



బుచ్చయ్యగారిపల్లిలో నేలరాలిన మామిడికాయలను సేకరిస్తున్న మహిళా రైతులు

ఆరోగ్య ఉపకేంద్రం కూల్చివేతపై విచారణ

- జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు
- అనుమతుల్లేకుండా కూల్చివేతపై జిల్లా అధికారులు సీరియస్
- గొట్లూరులో జిల్లా వైద్యాధికారి విచారణ



ఆరోగ్యఉపకేంద్రం కూల్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం

ధర్మవరంరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో వైసీపీ హయాంలో అనుమతి తీసుకోకుండా ఆరోగ్య ఉపకేంద్రం కూల్చివేతపై అధికారులు విచారణ చేపట్టారు. దీనిపై ఈ ఏడాది మార్చి25న 'ఆరోగ్య ఉపకేంద్రం కూల్చివేత' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంతో అధికారుల్లో చలనం వచ్చింది. దీనికితోడు గ్రామస్థులు సైతం.. దౌర్జన్యంగా కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుని, నూతన ఆరోగ్యఉపకేంద్రాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ప్రభుత్వ భవనం కూల్చివేతపై విచారణ చేయాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) ఫైరోజ్‌బేగంను ఆదేశించారు. ఆ మేరకు ఆమె శనివారం గొట్లూరు గ్రామానికి చేరుకుని, ఆరోగ్యఉపకేంద్రం కూల్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎందుకు కూల్చివేయాల్సి వచ్చిందని స్థానిక వైద్యాధికారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీటిపై అధికారులతో మాట్లాడి అనుమతిలేకుండా ఆరోగ్యఉపకేంద్రాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధి పేరు చెప్పి అనుమతులు తీసుకోకుండానే కొంత మంది ఆరోగ్య ఉపకేంద్రాన్ని కూల్చివేశారు. అప్పటినుంచి ఉపకేంద్రాన్ని గ్రామంలోని పాత సచివాలయంలో నిర్వహిస్తున్నారు. డీఎంహెచ్‌ఓ వెంట మండల వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్, సీహెచ్‌ఓ సాంబశివమ్మ ఉన్నారు.

స్వర్ణ వాసవి..!

వైభవంగా వాసవీమాత బంగారు విగ్రహావిష్కరణ

అమ్మవారి జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి టీజీ భరత్




కన్యకాపరమేశ్వరి బంగారు విగ్రహం

హిందూపురం, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో బంగారంతో తయారుచేసిన వాసవీమాత చరవిగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహావిష్కరణ వైభవంగా నిర్వహించారు. వాసవీ జయంతి వేడుకల మూడోరోజు శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్ నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ర్యాలీ చేశారు. ర్యాలీలో పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. 2.5 కేజీల బంగారంతో తయారు చేయించిన వాసవీమాత చరవిగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవీధర్మశాలలో వాసవీ అమృత కళశం పుస్తక పారాయణం చేశారు. మహిళలకు వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జేపీకే రాము, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, రవీంద్రుడు, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



అమ్మవారి బంగారు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్





పంటలు నేలపాలు



ధర్మవరం: బుడ్డారెడ్డిపల్లిలో నేలరాలిన మామిడికాయలు



అనంతపురం రూరల్: ఉప్పరపల్లిలో నేలకొరిగిన అరటి



బుక్కపట్నంలో నేలరాలిన మామిడిని చూపుతున్న రైతు

(5వ పేజీ తరువాయి)

అధికారులకు నివేదిక ఇచ్చామని మండల ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు.

● రాప్తాడు మండలం ఎం. చెర్లోపల్లిలో హనుమంతరాయుడు 4 ఎకరాలు, నారాయణప్ప 5 ఎకరాలలో సాగు చేసిన అరటి పంట నేలకొరిగింది.

నేలరాలిన మామిడి

● బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి, సిద్దరాంపల్లి, నారసింహపల్లి, గూనిపల్లి, మారాల, పాముదుర్తి, కొత్తకోట తదితర గ్రామల్లో దాదాపు 500 ఎకరాల్లో మామిడికాయలు నేలరాలాయి.

● ధర్మవరం మండలం బుడ్డారెడ్డిపల్లిలో డి.నారాయణరెడ్డి, సంజీవులు తోటలో మామిడి కాయలు రాలిపోయాయి. గొట్లూరులో అరుణశ్రీ సాగుచేసిన అరటితోట నేలకొరిగింది. బడన్నపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కూలిన పాఠశాల గదులు

చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు గదులు వర్షానికి శనివారం కుప్పకూలాయి. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులకు పెద్ద ప్రమాదమే తప్పింది. సైన్స్‌ల్యాబ్ గది, 3వ తరగతి గది శిథిలావస్థకు చేరాయని, దీంతో వేరే గదుల్లోకి మార్చామని హెచ్ఎం ఓబులమ్మ తెలిపారు. ల్యాబ్‌లో పరికరాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు.



చెన్నేకొత్తపల్లిలో కూలిన పాఠశాల తరగతి గదులు

వరి రైతుకు నష్టం



సి.బండమీదపల్లి వద్ద ఈదురుగాలులకు నేలమట్టమైన వరి పంట

శింగనమల మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వేలాది ఎకరాల్లో వరి పంట నేలమట్టమైంది. కోతకోసి ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. నష్టం రూ.కోట్లలో ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శింగనమల శ్రీరంగరాయని చెరువు కింద రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగు చేశారు. కోత సమయం కావడంతో మడులను ఆరబెట్టారు. గాలివాన దెబ్బకు శుక్రవారం రాత్రి 90 శాతం పంట నేల మట్టమైంది. తడి ఆరేదాకా కోత కోయడం సాధ్యం కాదని, ఈలోగా ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శివపురం, సి.బండమీదపల్లి, పోతురాజు కాల్వ గ్రామాల పరిధిలో 50 శాతం పంట కోత కోసి, ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. తరిమెల, కల్లుమడి, గుమ్మేపల్లి రాచేపల్లి, నిదనవాడ, ఉల్లికల్లు, జూల్యాకాలువ గ్రామాల పరిధిలో 75 శాతానికి పైగా వరి పంటను కోశారు. పొలాల్లో ఆరబెట్టిన పశుగ్రాసం తడిసిపోయింది. పశువులకు మేత లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొలకెత్తే ప్రమాదం..



రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట కోయడానికి మడి ఆరబెట్టాను. గాలివానకు పంట నేల మట్టమైంది. కోత మిషన్ రావడానికి ఇంకా వారం పడుతుంది. మడిలో నీరు నిలిచినందున ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉంది. పంట సాగుకు రూ.70 వేలు ఖర్చు చేశాను. నయాపైసా కూడా చేతికి వచ్చేలా లేదు. -వడ్డే ఆదెప్ప, సి.బండమీదపల్లి

తడిసిన ధాన్యాన్ని కొనరు..



ఐదు ఎకరాల్లో వరి పంటను కోత కోశాను. వడ్లను మడిలోనే రాశిగా పోశాను. వర్షానికి ధాన్యం మొత్తం తడిసిపోయింది. రూ.2 లక్షలు వరకు ఖర్చు చేశాను. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. - వెంకటసుబ్బయ్య, సి.బండమీదపల్లి

ఏటా నష్టమే..



వరి పంటను శనివారం కోయించాలని మిషన్ తెప్పించాను. శుక్రవారం రాత్రి గాలివానకు పంట నేల మట్టం అయింది. ప్రతి సంవత్సరం ఇలాగే నష్టపోతున్నాను. పంటలు సాగు చేయాలంటే భయంగా ఉంది. -టోపీసాబ్, సి.బండమీదపల్లి

వర్షం ముంచేసింది..



అప్పు చేసి ఐదు ఏకరాల్లో వరి సాగు చేశాను. దిగుబడి బాగా వచ్చింది. రెండు మూడు రోజులలో పంటను కోద్దామని అనుకున్నాను. గాలివానకు మొత్తం నేలవాలింది. నీరు ఇంకిపోయేలోగా ధాన్యం మొలకెత్తుతుంది. రూ.2 లక్షలకుపైగా పెట్టుబడి నష్టపోయాను. -తలారి నాగేంద్ర, శింగనమల

ఆదుకుంటాం..

గాలివానకు వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులను క్షేత్రస్థాయికి పంపించాము. పంట నష్టాన్ని అంచనావేసి నివేదిక ఇస్తారు. ప్రభుత్వం ద్వారా బాధిత రైతులను ఆదుకుంటాము. -బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



మారుతీప్రసాద్ (ఫైల్)

గాండ్లపెంట, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని చిన్నమిట్ట వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మారుతీప్రసాద్ (36) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మారుతీప్రసాద్ ఆటో తోలుతూ జీవనం సాగిస్తుండేవాడు. శుక్రవారం పనిమీద కదిరికి వెళ్లాడు. రాత్రి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యాడు. చిన్నమిట్ట వద్ద గేదెలను తప్పించే ప్రయత్నంలో బైక్ బోల్తాపడింది. మారుతీప్రసాద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు వెంటనే 108 వాహనంలో కదిరికి తరలించారు. అప్పటికే మారుతీప్రసాద్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

ప్రాణంతీసిన ఫోన్ వ్యసనం

● మొబైల్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మే3(ఆంధ్రజ్యోతి): మొబైల్, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మున్నానగర్‌కు చెందిన కల్లూరు చంద్రకాంత్(20) స్థానిక ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండేవాడు. కళాశాలకు సరిగా వెళ్లకుండా మొబైల్ చూస్తూ, అందులో గేమ్స్ ఆడుతుండేవాడు. ఈ విషయంపై తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో శనివారం తల్లిదండ్రులు బయటికెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఉరేసుకుని, చంద్రకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య



సామ్లు (ఫైల్)



శర్మస్ వలి(ఫైల్)

ఆత్మకూరు, ఉరవకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక జిల్లాలో శనివారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన సామ్లు నాయక్(40), ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన శర్మస్ వలి(49) ఉరి వేసుకున్నారు. సామ్లూనాయక్‌కు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ సాగు చేసేవాడు. సరైన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.8 లక్షలకు పైగా పేరుకుపోయాయి. దీంతో దిక్కుతోచక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆయన భార్య సోముబాయి, నలుగురు పిల్లలు ఉన్నారు. శర్మస్ వలి కౌలు రైతు. ఐదెకరాలను కౌలుకు తీసుకుని కంది, వేరుశనగ సాగు చేసి నష్టపోయాడు. అప్పులు రూ.5 లక్షలకు పైగా ఉన్నాయి. సేద్యం గిట్టుబాటు కాకపోవడంతో కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవాడు. కానీ అప్పుల ఒత్తిడి పెరగడంతో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య ఫాహిద, కూతురు ఉన్నారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 588 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.



గ్రూప్-1 అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపుతున్న పోలీసులు



పరీక్షరాసి బయటకు వస్తున్న దివ్యాంగ అభ్యర్థులు

తొలిరోజు ప్రశాంతం

● గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం
● 205 మంది గైర్హాజరు

అనంతపురం టౌన్, మే3(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం మొదలయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా సాగాయి. వారంరోజులుపాటు జరిగే పరీక్షలను జిల్లాకేంద్రంలోని పీవీకేకే, శ్రీబాలాజీ పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు కొనసాగాయి. 594మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 389 మంది రాశారు. 205 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కేంద్రాలవద్ద భారీ పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.



పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అదనపు సాయం ఇళ్లపై దృష్టి పెట్టండి

● జూన్ 10లోపు నిర్మాణాలు పూర్తి చేయాలి
● ఇంజనీర్లకు హౌసింగ్ పీడీ ఆదేశాలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 3(ఆంధ్రజ్యోతి): అదనపు ఆర్థిక సాయంతో నిర్మాణం చేపట్టిన ఇళ్లపై దృష్టి పెట్టాలనీ, జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శైలజ.. ఇంజనీర్లను ఆదేశించారు. తన చాంబర్‌లో గృహనిర్మాణాలపై హౌసింగ్ పీడీ శైలజ శనివారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 9,711 అసంపూర్తి ఇళ్ల లబ్ధిదారులను గుర్తించగా.. ఇప్పటి వరకు 3,790 నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. జూన్ 10వ తేదీలోపు మిగిలిన 5,921 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అదనపు సాయాన్ని ఇప్పటికే లబ్ధిదారులకు చెల్లించిందన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చొరవ చూపాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రజల్లో అవగాహన తేవాలన్నారు. సొంత స్థలం ఉన్న పేదలు ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి ఆర్జిత కల్యాణోత్సవ తేదీలివే..

కదిరి, మే 3(ఆంధ్రజ్యోతి):ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెలలో నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవాల తేదీలను ఈఓ శ్రీనివాసరెడ్డి శనివారం ప్రకటించారు. 8, 9, 13, 14, 15, 19, 20, 21, 22, 23, 25, 28, 29, 30 తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రోజుకు నాలుగు టిక్కెట్లు విక్రయిస్తామని, టిక్కెట్ ధర రూ.6,500 అని తెలిపారు. ఒక టిక్కెట్‌పై ఐదుగురికి ప్రవేశం కల్పిస్తామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీలో 5,041 మంది పాస్

ఫలితాలను విడుదల చేసిన ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత

అనంతపురం సెంట్రల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 5041మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత తన కార్యాలయంలో రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో కలిసి పరీక్షా ఫలితాలను విడుదలచేశారు. అనంతరం వీసీ అనిత మాట్లాడుతూ.. బీఎస్సీ, బీకామ్, బీఏ, బీబీఏ, బీసీఏ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 6,577 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 5,041 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణత శాతం 76.65గా నమోదైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం జ్ఞానభూమి పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు. ఫెయిలైన విద్యార్థులు రివాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున ఈనెల 19లోపు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు తిమ్మప్ప, శంకర్, అధికారులు మారుతి, సాయిశివ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ప్రొఫెసర్ అనిత

మున్సిపల్ టీచర్ల సీనియారిటీ యథాతథంగా ఉంచాలి

● డీఈఓకు సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, మే 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాను యథాతథంగా కొనసాగించాలని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు.. డీఈఓ ప్రసాద్‌బాబును కోరారు. పాత డీఈఓ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబును ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవీంద్ర, రామచంద్ర, గురుప్రసాద్, పలువురు టీచర్లు శనివారం కలిశారు. వారు మాట్లాడుతూ... అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో టీచర్ల ప్రమోషన్లలో తప్పిదాలపై కొందరు టీచర్లు గతంలోనే లోకాయుక్త, హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో అప్పటి మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, డీఈఓ, మున్సిపల్ కమిషనర్ నిబంధనల మేరకు సీనియారిటీ జాబితాను తయారు చేశారన్నారు. 2004లో కొందరు టీచర్లు స్వార్థం కోసం అప్పటి మున్సిపల్ కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందనీ, డీఎస్సీ వచ్చే వరకూ ఎస్జీటీలకు (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్) తాత్కాలికంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ 30శాతం కోటాలో ప్రమోషన్లు కల్పించారన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా ఇచ్చారన్నారు. 2004లో ప్రమోషన్లు పొందిన ఆ టీచర్లు సీనియారిటీ జాబితాలో చేరి 2011లో (70 శాతం కోటా) పదోన్నతుల్లో ఆ పోస్టులను అబ్జార్బ్ చేశారని పేర్కొన్నారు. తర్వాత ఇచ్చిన అనేక ప్రమోషన్లలో ఆ టీచర్ల జాయినింగ్ తేదీలను 2011 మే 1గా చూపారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీనియారిటీ జాబితా తయారీ సమయంలో వాస్తవాలను గుర్తించాలన్నారు. మున్సిపల్ టీచర్ల సీనియారిటీని యథాతథంగా కొనసాగించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ... నిబంధనల మేరకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎవరికీ అన్యాయం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమాధులపై వాలిన వైసీపీ

● రాత్రికి రాత్రే శ్మశాన స్థలం చదును
● పోలీసులకు తల్లిమడుగుల గ్రామస్థుల ఫిర్యాదు



శ్మశాన స్థలాన్ని చదును చేసిన దృశ్యం

కనగానపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా వైసీపీ నాయకుల ఆగడాలు ఆగట్లేదు. మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో శ్మశాన స్థలంపైనే కన్నేశారు. రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో దున్ని చదునుచేశారు. శ్మశాన స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులు శనివారం కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిమడుగుల గ్రామ పరిధి సర్వే నంబరు 256-1లో 1.16 ఎకరాల భూమిని శ్మశానానికి కేటాయించారు. ఆ స్థలం పక్కనే వైసీపీ నాయకుడి పొలం ఉంది. ఇటీవల గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సర్వే చేసిన అధికారులు శ్మశాన వాటిక స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి, రాళ్లు పాతారు. అయినా.. శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు బండి ధనుంజయ ప్రయత్నిస్తున్నాడు. బంధువులైన బిల్లే ప్రభాకర్, బండి మనోజ్ సాయంతో శ్మశాన స్థలాన్ని చదును చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, శ్మశాన స్థలాన్ని కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

నేడు దళిత ఎమ్మెల్యేల అభినందన సభ

అనంతపురం విద్య, మే 3(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం దళిత ఎమ్మెల్యేల అభినందన సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. బండారు శంకర్ మాట్లాడుతూ.. ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు మాసినేని గ్రాండ్‌లో దళిత ఎమ్మెల్యేల సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, దస్తగిరి, జయసూర్యను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రవేశ పరీక్ష

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మ జ్యోతిబాఫూలే బాలురు, బాలికల గురుకుల పాఠశాలల్లో బీసీ గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ హమీనా బేగం శనివారం ప్రకటనలో తెలిపారు. నసనకోట గురుకుల పాఠశాల పరీక్షాకేంద్రంలో 479 మంది, పేరూరు పాఠశాలలో 279 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటితో పాటు వైద్యసదుపాయం కల్పించామన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పేమెంట్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 237533

ఉచిత విద్యావకాశాలు
ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ 9030661651.
AJA- 237531

TOLET
డబుల్ బెడ్ రూమ్ ఇల్లు,మంచినీరు పుష్కలం, బాడుగ Rs. 8000/- మాత్రమే. అనంతపురం టౌన్ కళ్యాణదుర్గం రోడ్డుకు Dr. రజాక్ హాస్పిటల్ వద్ద Cont:9951626131.
AJA-Krishana

కావలెను
అక్షయ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ నందుపనిచేయుటకు అనుభవం కలవారు డ్రైవర్లు, సిస్టమ్ ఆపరేటర్ (లేడీస్) సైట్ సూపర్ వైజర్స్ కావలెను.విద్యుత్ నగర్ 80 Ft Road ATP,Cell:9381208110.
AJA-237530

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
చిన్న ప్రకటన పెద్ద స్పందన

కావలెను
ATP టౌన్ నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ కావలెను. M.S.Office నందు అనుభవం కలిగి, హిందీ భాష కూడా మాట్లాడగలగాలి. యువకులకు మాత్రమే కావాలి. సంప్ర: 9381838140, 8977731455.
AJA-237526

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు తరలిరండి



చెన్నకేశవుడికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో గల లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహిస్తున్నారని, ఈ ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తరఫున చెన్నకేశవుడికి హరీశ్‌బాబు, జింకా రామాంజనేయులు పట్టువస్త్రాలను సమర్పించారు. వారికి ఆలయ అడహక్ కమిటీ ఛైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాశ్ స్వాగతం పలికారు. అనంతరం చెన్నకేశవుడికి పూజలు చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయండి

కదిరి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామ కఠంలోని స్థలాలను అక్రమ రిజిస్ట్రేషన్ చేసినవారిపై చర్యలు తీసుకుని, వాటిని రద్దు చేయాలని మండలంలోని వీరేపల్లిపేటకు చెందిన బాధితులు కోరారు. ఈమేరకు వారు శనివారం సబ్‌రిజిస్ట్రార్ కవితకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనెంబర్ 105-1లో ఎకరా 14సెంట్లు 1994లో అప్పటి ప్రభుత్వం 32 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అప్పట్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన జి. హనుమంతురెడ్డి తన అక్క పేరుతో 2022లో 24సెంట్లు నకిలీ పత్రాలు సృష్టించి దాన విక్రయం కింద రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. అతడిపై చర్యలు తీసుకుని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు భాస్కర్‌రెడ్డి, కొండమ్మ, వెంకటరమణమ్మ, నాగమునెమ్మ, సరస్వతి, ఆదినారాయణ, రత్నమ్మ, గంగన్న తదితరులు కోరారు.

మోడల్‌స్కూల్ ఫలితాల్లో
తనకల్లు విద్యార్థుల ప్రతిభ

తనకల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన పోటీ పరీక్షల్లో తనకల్లు మండలానికి ఐదు ర్యాంకులు వచ్చినట్లు ఎంఈఓ లలితమ్మ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామాలైన ఎర్రచెరువుపల్లి, సున్నంపల్లి వాండ్లపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని వివరించారు. ఎర్రచెరువుపల్లికి చెందిన ప్రణీత్‌కు మొదటి ర్యాంకు, సున్నంపల్లివాండ్లపల్లికి చెందిన తరుణ్‌తేజ్ రెండో ర్యాంకు, ఎర్రచెరువుపల్లి పావనికి మూడో ర్యాంకు, ఎర్రచెరువుపల్లి ధరణికి నాల్గో ర్యాంక్, నిఖిలకు ఐదో ర్యాంక్ వచ్చాయని తెలిపారు. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మహేష్, రమేష్, ప్రకాష్‌ను ఎంఈఓలు లలితమ్మ, కల్యాణి అభినందించారు.



మొదటి ర్యాంకు సాధించిన ప్రణీత్

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం ఉచిత కంటి పరీక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు జరుగుతుందన్నారు. కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎంపికైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారని అన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో గ్యాస్ డెలివరీ బాయ్ గురుస్వామి ఆత్మహత్యకు యత్నించాడు. టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు...కేతిరెడ్డికాలనీకి చెందిన గురుస్వామి గ్యాస్ డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత సీట్లు

ఓబుళదేవరచెరువు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, ఎయిడెండ్ పాఠశాలల్లో ఆర్‌టీఈ యాక్టు 2009 సెక్షన్ 12(1సి) ప్ర కారం పేద విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో విద్యావకాశాలు కల్పిస్తున్నట్లు ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ తెలిపా రు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. 2025-26 విద్యాసంవత్సరం 1వతరగతిలో 25శాతం ఉచిత సీట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 15వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్నవారిని లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. స్టేట్ సిలబస్‌కు 5 సంవత్సరాలు పూర్తి ఉండాలని, సీబీఎస్ఈ సిలబస్‌కు 6 సంవత్సరాలు పూ ర్తయి ఉండాలన్నారు. వివరాల కోసం ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

కదిరిఅర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల్లో ఆదివారం నుంచి ఈనెల 15వరకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ పోలప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5న ముత్యాలచెరువు, 6న కాళసముద్రం, 7న కొండమనాయునిపాళ్యం, 8న పట్నం, 12, 13న కుమ్మరవాండ్లపల్లి సచివాలయం -1, 14, 15 కుమ్మరవాండ్లపల్లి సచివాలయం-2లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

కదిరి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివి, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్లు శనివారం అభినందించారు. స్థానిక పెన్షనర్ల భవనంలో ఉత్తమ మార్కులు సాధించిన భరత్ యాదవ్, వర్షికను సన్మానించి, నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయం అన్నారు. వారిని ప్రోత్సహించడానికే ఈ అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపా రు. కార్యక్రమంలో పెన్షనర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వర్షికను సన్మానిస్తున్న పెన్షనర్లు

నిలువ నీడలేక.. నడిరోడ్డుపై నిరీక్షణ

బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు

కొత్తచెరువు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండ, వానలకు ఇబ్బందులు పడుతున్నారు. నడిరోడ్డు పైనే బస్సుల కోసం పడిగాపులు పడుతున్నారు. కొత్తచెరువు నాలుగురోడ్ల కూడలిలోని ధర్మవరం, పుట్టపర్తి, బుక్కపట్నం, పెనుకొండ రహదారులలో బస్సుషెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు నిలువ నీడలేక నడిరోడ్డుపై నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు సాధారణ ప్రయాణికులు అవసరాల కోసం ఆర్టీసీపై ఆధారపడుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు, ఆటోల కోసం రోడ్డుపైనే గాలివాన, ఎండకు సైతం లెక్కచేయకుండా నిలబడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. దుకాణాల ముందు నిలబడితే వారు కూడా తమ వ్యాపారులకు అడ్డుగా ఉన్నారని, పక్కకు పోవాలంటూ చీదరించుకుంటున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు, గర్భవతులు పుట్టపర్తికి ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి ఆరోగ్య పరీక్షల కోసం వస్తుంటారు. వారు కూడా కూర్చోవడానికి బల్లలు కూడా లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొత్తచెరువులో రహదారిపై బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

శ్రమ దోపిడీ లేని సమాజమే లక్ష్యం

మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్ జయలక్ష్మి

కదిరి లీగల్, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రమ దోపిడీ లేని సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల న్యాయసేవ అధికారసంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. మే డే ను పురస్కరించుకుని కార్మిక చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శనివారం ఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు కార్మిక శాఖ సహాయ అధికారి హెచ్. జహూరుద్దీన్ అధ్యక్షత వహించారు. మరో న్యాయాధికారి లోకనాథం, న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి, కార్మిక నాయకులు రఫీక్, జాఫర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు. కార్మిక దినోత్సవ పుట్టుపూర్వోత్తరాలను న్యాయాధికారి జయలక్ష్మి వివరించారు. అదేవిధంగా కార్మిక చట్టాలపైన అవగాహన పెంచుకోవాలన్నారు. అసంఘటిత కార్మికులు ఐక్యమత్యంతో మెలగాలని చెప్పారు. కార్మికులకు ఉన్న చట్టాలను వివరించి ఉపయోగించుకోవాలన్నారు. లోక్‌ఆదాలత్ ద్వారా ఉచిత న్యాయసహాయాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరికి అమోదయోగ్యమైన గ్రంథం రాజ్యాంగం అని దాని ఔన్నత్యాన్ని వివరించారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

ఘనంగా కావమ్మ, మారయ్య కల్యాణోత్సవం

నంబులపూలకుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని కొత్తరోడ్డు వద్ద వెలసిన కావమ్మ, మారయ్యల తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. కావమ్మ, మారయ్యల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, పురోహితులు కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం కావమ్మ, మారయ్యలను గ్రామంలో ఊరేగించారు. భక్తులు టెంకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



కావమ్మ, మారయ్య కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రైతు మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

బత్తలపల్లి మే3(ఆంధ్రజ్యోతి): రైతు మృతికి కారకులైన ప్రైవేటు ఫైనాన్స్ వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోడేకండ్ల గ్రామానికి చెందిన మల్లేసు ప్రైవేటు ఫైనాన్స్ వారి వేధింపులు భరించలేక రెండు రోజుల క్రితం రైలు కింద పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న నాయకులు శనివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు రాక, చేసిన అప్పులు తీర్చలేని రైతును ప్రైవేటు ఫైనాన్స్ వారు ఇంటి వద్దకు వచ్చి వేధించారని తెలిపారు. రెండు కంతులు కట్టాల్సి ఉండగా.. ఒక కంతు కట్టినా ప్రతి రోజూ ఇంటివద్దకు వచ్చి వేధించడంతో అవమానభారంతో రైతు మృతి చెందాడని అన్నారు. రైతును వేధించిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వాహనం కోసం ఎదురుచూపులు

తనకల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): గతంలో గ్రామాల్లోని చౌకధాన్యపు డిపోల వద్ద బియ్యం ఇచ్చేవారు. ఎప్పుడుపడితే అప్పుడు వెళ్లి బియ్యం తెచ్చుకునేవారు. ప్రస్తుతం రెండుమూడు గ్రామాలకు కలిపి ఒకే వాహనం ఏర్పాటు చేశారు. శనివారం టి.సదుం గ్రామస్థులు మాట్లాడుతూ ఈ బియ్యం బండి ఎప్పుడు వస్తుందో ఏమో అని పనిపాట వదిలి ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొక్కంటి క్రాస్‌లో బియ్యం బండి నిర్వాహకుడు ఇతర గ్రామాల వారికి బియ్యం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఏమో ఎక్కడైనా బియ్యం తీసుకోవచ్చని పదే పదే చెబుతోంది. కింది స్థాయి వారేమో ఆ మాటలు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ వారు ఎక్కడుంటే అక్కడికెళ్లి బియ్యం ఇస్తున్నారని ఆరోపించారు. తాము అడిగితే మా డబ్బులు మాకిచ్చి మీ బండ్లు మీరు తీసుకోవడం టూ చెబుతున్నట్లు చెప్పారు. సంబంధిత సీఎస్‌డీటీ, తహసీల్దార్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన చెందారు.

ఆర్డీటీకి అండగా నిలుద్దాం: యూటీఎఫ్



ఆర్డీటీకి సంఘీభావం తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో విద్య, వైద్యం, క్రీడా, గృహ నిర్మాణం, వ్యవసాయ రంగంతోపాటు అనేక రంగాల్లో స్వచ్ఛంద సేవలు అందిస్తున్న ఆర్డీటీకి అండగా నిలుద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీటీ కుల,మత,రాజకీయ రంగాలకు అతీతంగా సేవలు అందిస్తోందని అన్నారు. ఉచిత విద్యకు తోడ్పాటు అందిస్తూ ఎంతోమంది విద్యార్థులను గొప్ప స్థానంలో నిలబడటంలోనూ, కరోనా వంటి విపత్కర సమయంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడడంలోనూ సంస్థ ముందు ఉందన్నారు. అనేక క్రీడల్లో దేశస్థాయి క్రీడాకారులను తయారుచేసిందని, చెక్‌డ్యాంలు నిర్మించి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, సురేశ్, రాంప్రసాద్, రామాంజనేయులు, వెంకటకిశోర్, మల్లికార్జున పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ పునఃప్రారంభానికి చర్యలు



పనులను పరిశీలిస్తున్న నాయకులు

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డులో గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న సరస్వతి శిశుమందర్ పునః ప్రారంభిస్తున్నట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ఈ పాఠశాల స్థితిగతుల గురించి తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాఠశాల పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో శనివారం హరీశ్‌బాబు పాఠశాలను సందర్శించి పనులను పరిశీలించారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పాఠశాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే ఈ పాఠశాల పునః ప్రారంభపనులు చేపడతున్నామని ఆయన తెలిపారు.

గర్భిణులకు సీమంతం

ముదిగుబ్బ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జేకే పల్లి తండాలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు పోషణ పక్వాడాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి, సూపర్‌వైజర్ లలితమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మీ పిల్లల భవితకు.. మాది భరోసా

● ప్రభుత్వ పథకాలపై ప్రచారం ● ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచితపథకాలు గురించి మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేలా అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు. ర్యాలీలు, విద్యా సదస్సులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తీసుకుంటున్నారు. పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు గ్రామంలో గత నెల 23న 5వతరగతి నుంచి 6వతరగతిలోకి 31మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకున్నట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. ప్రవేశ దరఖాస్తు నుంచి పాఠ్య, రాత పుస్తకాలు, దుస్తులు, బూట్లు, సంచులు, మధ్యాహ్న భోజనం అన్నీ ఉచితంగానే అందించడంతో పాటు నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని అవగాహన పెంచుతున్నారు. తెలుగుతో పాటు ఆంగ్లమాధ్యంలోనూ బోధన ఉచితంగానే అందిస్తున్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రలను ప్రవేశపెట్టింది. దీని వల్ల పిల్లల్లో మేధాశక్తిని పెంచేందుకు దోహదపడుతుందంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే కాకుండా సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను ఏ,బీల్లోకి రప్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాలల పనిదినాల సమయంలోనే ఉదయం ఒక గంట, సాయంత్రం గంట అదనపు బోధన నిర్వహిస్తున్నామని వివరిస్తున్నారు.



వెంగలమ్మచెరువులో ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకుంటున్న డీఈఓ, ఉపాధ్యాయులు

లక్ష్యాలను నిర్దేశించాం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చేందుకు లక్ష్యాలను నిర్దేశించాం. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు డ్రైవ్ నిర్వహించి తల్లిదండ్రులను కలుస్తున్నారు. వారి నుంచి అనుమతి పత్రాలను తీసుకుంటున్నారు. గుణాత్మక విద్యను అందిస్తామనే భరోసా కల్పిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల వివరాలను సేకరించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

- కిష్టప్ప, డీఈఓ

జల్‌జీవన్ మిషన్ కింద బోరుబావులు



బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ పోలప్ప

కదిరిఅర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పథకం కింద మండలంలోని కుమ్మరవాండ్లపల్లి, బురుగుపల్లిలో బోరుబావులు తవ్వించినట్లు శనివారం ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవతో జలజీవన్ మిషన్ పథకం కింద మండలానికి రూ.5.5 కోట్లు నిధులు మం జూరయ్యాయని పేర్కొన్నారు. రెండు గ్రామాల్లో బోర్లు తవ్వించగా, నీరు పుష్కలంగా పడినట్లు తెలిపారు. ఈ బోర్ల వల్ల ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయుడు, మాజీ సర్పంచ్ గంగులప్ప, ఎంపీటీసీ పుల్లయ్య, నాయకులు ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, భార్గవ్, శ్రీనివాసులు, ప్రేమలత పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు

ఓబుళదేవరచెరువు, మే 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మిట్టపల్లి నాగవేణి ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేడ్కర్ సర్కిల్ నుంచి పోస్టాఫీసు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్ర మంలో నాయకులు బంగారు క్రిష్ణమూర్తి, మనోహర్, డాక్టర్ క్రిష్ణమూర్తి, రా జశేఖర్, రామాంజి, నగేష్, ఓబులప్ప, హరిబాబు, బాలరాజు పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం మరిచారు..



గౌకనపేట సచివాలయానికి తాళం వేయని దృశ్యం

నంబులపూలకుంట, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌకనపేట గ్రామ సచివాలయానికి తాళం వేయడం మరిచి అధికారులు శనివారం వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. సచివాలయంలో గ్రామానికి సంబంధించిన వివరాలన్నీ ఉంటాయని, కంప్యూటర్లు, ప్రింటర్, ఫర్నీచర్ ఉందన్నారు. బాధ్యత లేకుండా అధికారులు వెళ్లిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ఎంపీడీఓ ఆంజనప్పను వివరణ కోరగా.. ఆ సచివాలయానికి ఎదురుదొన కార్యదర్శి రాంప్రసాద్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారని, ఉదయం, సాయంత్రం తలుపులు తెరవడం, మూతవేయడం స్థానికులకు అప్పగించినట్లు చెప్పారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు లేకుండా చూస్తామని అన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి : ఏపీటీఎఫ్



ధర్నాను విజయవంతం చేద్దామంటున్న ఏపీటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మే 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ ఈ నెల 5న ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు శనివారం ఎన్జీఓహోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే కొనసాగిస్తూ మరింత గందరగోళ పరిస్థితులు కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను నెలకొల్పితే ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలను ఏర్పాటుచేసి మరింత గందరగోళం సృష్టిస్తోందన్నారు. ఒక్కొక్క పాఠశాలకు ఒక్కొక్క రకంగా ఉపాధ్యాయులను నియమించడం తగదని, 12వ పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఇతర ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బలరాముడు, శ్రీనివాసులు, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, బాలయ్య, నరసింహులు, వాసుకుమార్, జగదీశ్, రవికుమార్ పాల్గొన్నారు.

కుక్కలతో జనం బెంబేలు

రెండురోజుల్లో ముగ్గురిపై దాడి

కొత్తచెరువు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్మపాళ్యం పసలమంద వీధిలో కుక్కల బెడదతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల భయంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఇక కొత్తవారు వస్తే అంతే సంగతులు.. మీదపడి దాడి చేస్తున్నాయి. రెండు రోజుల్లో ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీధుల్లో వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా తిరుగుతుంటారు. వారిపై దాడి చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



కమ్మపాళ్యం పసలమంద వీధిలో కుక్కలు

వరి పంట చేతికందేనా..?

- యంత్రాలు దొరకవు.. కూలీలు రారు
- అకాల వర్షాలతో దెబ్బతింటున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

మడకశిర రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): రబీలో వేసిన వేరుశనగ పంట చేతికందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన వరి పంటను కోసేందుకు కూలీలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు అకాల వర్షాలతో వరి యంత్రాలు దొరక్క వరి గింజలు నాల రాలిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో మడకశిర, రోళ్ళ అగళి, గుడిబండ, అమరాపురం మండలాల్లో చెరువులు, బావులు కింద 578 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఒకేసారి పంట కోతకు రావడం, ఉరుములు, మేరుపులతో వర్షాలు కురుస్తుండటంతో చేతికి వచ్చిన వరి పంట నేలరాలుతోందని రైతులు వాపోతున్నారు. వర్షాలు వస్తుండతో వరి తొలగించే యంత్రాలకు గిరాకి పెరిగింది. వాటి ధర రెట్టింపయ్యింది. కూలీలకు అధిక ధరలు ఇస్తామన్నా ఎవరూ రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వర్షాలకు నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


కోతకు వచ్చిన వరి పంట

రాలిపోయిన వడ్లు



భారీ గాలితో కూడి వర్షాలు కురుస్తుండటంతో చేతికి వచ్చిన వరి పంట నేలపాలైంది. ఎకరాకు రూ.20 వేలు చొప్పున నాలుగు ఎకరాలకు రూ.80 వేలు పెట్టుబడి పెట్టి వరి పంట సాగుచేశా. పంట దిగుబడిబాగా వచ్చింది. కోత సమయంలో భారీ గాలులతో వర్షాలు కురుస్తుండటంతో వరిపంట సగానికి పైగా నెలపాలైంది. ఈ గ్రామంలో 20 ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-రాజగోపాల్ గౌడ్, రైతు, కోతులగుట్ట

వరికోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది



భారీ వర్షాలు కురుస్తుండటంతో చేతికి వచ్చిన వరి పంట నేలపాలవుతోంది. వరికోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. గతంలో గంటకు రూ.3 వేలు ఇచ్చేవాళ్లం. వర్షాల కారణంగా వరికోత యంత్రాలు దొరకడం లేదు. దొరికినా రెట్టింపు ధర డిమాండ్ చేస్తున్నారు. గంటకు రూ.4500 నుంచి రూ.5 వేలు అడుగుతున్నారు. సన్నచిన్నకారు రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు భోజనంపెట్టి రూ.300 ఇస్తామన్నా ఎవ్వరూ రావడంలేదు.

-వేమారెడ్డి, రైతు, పాపసానిపల్లి

న్యూస్ బాక్స్

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా అర్చకులు రామక్రిష్ణాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

ఛైర్మన్లను కలిసిన టీడీపీ నాయకులు


ఛైర్మన్లను అభినందిస్తున్న పెనుకొండ టీడీపీ నాయకులు

పెనుకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ వెంకటేశ్‌ను పెనుకొండకు చెందిన టీడీపీ నాయకులు అనంతపురంలోని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్రిష్ణమూర్తి, రామచంద్ర, మురళి, రాజగోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్, నాయకులు

పెనుకొండ టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్యను మంత్రి సవిత త్వరలో శాశ్వత పరిష్కారం పరిష్కారం చూపనున్నారని 15వ వార్డు ఇన్‌చార్జి బాబుల్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌తో కలిసి వార్డులోని సమస్యలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారన్నారు. మున్సిపల్ నిధులతో త్వరలోనే డ్రైనేజీ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో త్రివేంద్ర, సమీ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మండల న్యాయసేవ అధికార సంస్థ ఛైర్మన్ వాసుదేవన్

పెనుకొండ టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ వాసుదేవన్ సూచించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడే సందర్భంగా కార్మికచట్టాలు, న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మదన్‌మోహన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అగళి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏఎస్ఐ బషీర్ వాహనాలనుత నిఖీ చేశారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్ తదితరవాటిని పరిశీలించారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీటుబెల్ట్ ధరించాలన్నారు.

దళిత జాగృతి అభియాన్ ర్యాలీ

పావగడ, మే 3(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతం త్ర్యం వచ్చి 78సంవత్సరాలు గడిచినా రాజ్యాంగంలో దళితులకు కల్పించిన హక్కు లు, ఉద్యోగ ఇతర అంశాలలో అన్యాయం జరుగుతుండంపై రాష్ట్ర వ్యాప్తంగా దళిత అభియాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు జనాభా లెక్కల అధికారులకు సరైన సమాచారం అందించి సహకరించాలని అధికారులు సూచించారు.

ఆకట్టుకున్న నాటిక

సోమందేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన అభినవ అంబేడ్కర్ సాంస్కృతిక నాటిక ఆకట్టుకుంది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జనంలో చైతన్యం నింపేందుకు నాటి కాలమాన పరిస్థితులను కళాకారులు కళ్లకు కట్టినట్లు చూపారు. కుల వివక్షత భిన్నకులాలవారిపై జరిగిన దాడులను ప్రదర్శించారు. రాజ్యాంగం గొప్పతనం దాని నిర్మాణం కోసం అంబేడ్కర్ పడిన శ్రమను కళాకారులు తమ ప్రదర్శనతో అలరించారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ


రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

గుడిబండ, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీసీ గిరి గ్రామంలో రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. శనివారం టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ ఆధ్వర్యంలో పనిమిట్లు అందజేశారు. టీడీపీ నాయకులు సిద్దప్ప, మాలే గౌడ్, రైతులు నాగన్న, సన్నీరప్ప, నాగరాజు, పుట్టన్న, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

పావగడ, మే 3(ఆంధ్రజ్యోతి): తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పాజిహళ్లి సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉప్పారుపల్లికి చెందిన ఆనంద్‌నాయక్ (50)అనే రైతు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు ఆనందనాయక్ వేరుశనగ విత్తనం కోసం రొద్దం సమీపంలోని రాసూరులో కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా విజయవాడకు చెందిన ఓ కారు అప్పాజిహళ్లి గ్రామ సమీపం మలుపులో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. స్థానికులు అతనిని హుటాహుటిన పావగడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుమణి సీఐ గిరీష్, ఎస్సై లక్ష్మణ్ ఘటనా స్థలానికి చేరుకుని కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో అవ్వమందలించిందని నాని అనే ఇంటర్ విద్యార్థి విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బోయ చెన్నమ్మ మనవడు నాని అవ్వతాతల వద్దే ఉంటున్నాడు. అవ్వ చెన్నమ్మ గడ్డి కోసుకురాలేదని విద్యార్థిని దండించడంతో మనస్థాపానికి గురై విషద్రావకం తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పెనుకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్‌వద్ద పెనుకొండ ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో కర్ణాటక మద్యం తరలిస్తున్న నల్లమాడకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. కారుతోపాటు 18 హైవార్డ్స్ విస్కీ బాక్సులను స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం పట్టుబడిందన్నారు. ఇద్దరు వ్యక్తులతోపాటు కారును స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదుచేసి రిమాండుకు తరలించామన్నారు. ఈఈఎస్‌టీఎఫ్ ఎస్ఐ ఓం సింహ, కానిస్టేబుళ్లు మల్లికార్జున, దేవేంద్రనాయక్, భరత్ పాల్గొన్నారు.


లేపాక్షి ఆలయం

ఛైర్మన్‌గిరి ఎవరికి దక్కేనో..?

- ఆశలపల్లకిలో అధికార పార్టీ నాయకులు

లేపాక్షి, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సర కాలం పూర్తవుతోంది. పార్టీకోసం అహర్నిశలు కష్టపడి గెలిపించుకున్న నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అలాంటి కోవలోకి చెందినదే లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి. గతంలో వైసీపీ ప్రభుత్వం నియమించిన ఛైర్మనే నేటికీ కొనసాగుతున్నారు. అధికారం చేపట్టికూడా కూటమి ప్రభుత్వం ఛైర్మన్‌ను నియమించకపోవడంతో కొంతమంది కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారు. ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురానికి వస్తున్నారు. లేపాక్షి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఛైర్మన్ పదవిని దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రస్తావన ఇప్పటికే ఎమ్మెల్యే పీఏల వద్ద, ముఖ్య నాయకులవద్ద వచ్చిందని విశ్వసనీయ సమాచారం. పార్టీకోసం కష్టపడినవారి వివరాలు సేకరించి ఎమ్మెల్యేవద్ద ఉంచారని నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిలో ఉండే వ్యక్తి ఎప్పుడూ స్థానికులకు, భక్తులకు అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించే వారి పేరును ఖరారుచేసినట్లు తెలిసింది. స్థానిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆలయ కమిటీ ఛైర్మన్ పదవికి పార్టీకోసం కష్టపడిన వ్యక్తికే కేటాయిస్తారని చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఏది ఏమైనా ఎమ్మెల్యే పర్యటనలో ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

అంగన్‌వాడీ భవనంపై కూలిన చెట్టు


అంగన్‌వాడీ భవనం పై కూలిన రావిచెట్టు

మడకశిర టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మాలేరాప్పం గ్రామంలో శనివారం తెల్లవారుజామున కురిసిన గాలి, వానలకు అంగన్‌వాడీకి అనుకొని ఉన్న పెద్ద రావిచెట్టు కూలిపోయింది. ప్రాథమిక పాఠశాలకు అనుకొని అంగన్‌వాడీ కేంద్రం ఉంది. దాని పక్కనే రావిచెట్టు ఉండేది. రాత్రి విచిన ఈదురుగాలులకు చెట్టు అంగన్‌వాడీ భవనంపై పడింది. ఎలాంటి ప్రమాదం లేక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీలుచుకున్నారు. భవనం 70శాతం దెబ్బంది. చెట్టును అధికారులు ఇంకా తొలగించలేదని గ్రామస్థులు తెలిపారు,

గాలివానకు ఇల్లు...


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారుతినగర్‌లో శుక్రవారం రాత్రి గాలివానకు గంగరత్నమ్మ చెందిన ఇల్లు కూలిపోయింది. ఘటన జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, బాదితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. నెలకు సరిపడా రేషన్, రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు బాధితులను పరామర్శించామన్నారు. త్వరలో పక్కాగృహాన్ని నిర్మించి ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, పెద్దకోడిపల్లి నాగప్ప, పూజారి మురళి, ఆనంద్, గోపాల్, సూరి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు వద్ద పారిశుధ్య పనులు


ట్యాంకు చుట్టూ ఉన్న చెత్తను తొలగిస్తున్న కాలనీవాసులు

పెనుకొండ రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని కోనాపురంలో తాగునీటి ట్యాంకువద్ద కాలనీవాసులు శుభ్రత పనులు చేపట్టారు. గ్రామంలో తాగునీటి కోసం కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడ్డారు. ఎస్సీ కాలనీ ఎగువ భాగంలో ఉన్న తాగునీటి ట్యాంకు అపరిశుభ్రంగా మారి శిధిలావస్థకు చేరింది. దీంతో కాలనీవాసులు సొంతంగా ఎక్స్‌కవేటర్ సాయంతో ట్యాంకుచుట్టూ ముళ్లపొదలు తొలగంచి శుభ్రపరిచారు. ట్యాంకుకు నీరు వదలాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సుదేష్ బాబు

పావగడ, మే 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త దివంగత జీఎస్ ధర్మపాల్ తనయుడు సుదేష్‌బాబు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పావగడ మున్సిపాలిటీ పరిధిలో 23వార్డు నుంచి 21మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక్క జేడీఎస్, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్‌గా గెలుపొందిన విషయం తెలిసిందే. రెండున్నర సంవత్సరాల నుంచి అధ్యక్ష పదవి జనరల్ కేటగిరికి రావడంతో చివరి అధ్యక్ష పదవికి సుదేష్ బాబు నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజులు ప్రకటించారు. గతంలో అధ్యక్ష పదవి ఆశించి నిరాశచెందిన సుదేశ్‌బాబుకు ఈసారి అధ్యక్ష పదవి రావడంతో అటు కుటుంబంలోనూ, కార్యకర్తల్లోనూ ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. పట్టణంలో టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు.


అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

గొల్లహట్టిలో సదుపాయాలు కల్పించాలి

- మహిళా ఆయోగ అధ్యక్షురాలు నాగలక్ష్మీ చౌదరి

పావగడ, మే 3(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి నోచుకోని మూగదాడబెట్ట, గొల్లహట్టి గ్రామానికి ఆదివారం నుంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని కర్ణాటక రాష్ట్ర మహిళా ఆయోగ అధ్యక్షురాలు నాగలక్ష్మీ చౌదరి సూచించారు. గ్రామంలో వీధి లైట్లు, స్నానపుగృహాలు, మరుగుదొడ్లు, లేవని వణ్యప్రాణుల మధ్య భయపడుతూ జీవనం సాగిస్తున్నారని కొన్ని పత్రికల్లో కథనాలు చూసి చలించిపోయి గ్రామాన్ని సందర్శించానని తెలిపారు. 2.26ఎకరాల స్థలంలో 50కుటుంబాలు జీవిస్తుంటే ఆ స్థలం తనకు చెందిందని ఒక వ్యక్తి కోర్టులో అపీల్ చేయడం మానవత్వం కాదన్నారు. వచ్చే నెల 16న కోర్టు తీర్పు అనంతరం గ్రామానికి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రూ.3కోట్లు నిధులు కేటాయించాలని రైతు సంఘం అధ్యక్షులు పూజారప్ప కోరారు. ఈఓ జానకీరామ్, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ పీడీఓ, గ్రామస్థులు పాల్గొన్నారు.


ముగదాళబెట్ట గ్రామస్థులతో మాట్లాడుతున్న నాగలక్ష్మీ చౌదరి









